బ్రిడ్జి నిర్మించండి మహాప్రభో..

- గణపవరం–బలిజేపల్లి మధ్యలో ప్రవహిస్తున్న వాగు
- వర్షం వస్తే పోలీసులు కాపలా కాయాల్సిన పరిస్థితి
- రాకపోకలకు అంతరాయం



గణపవరం–బలిజేపల్లి మధ్యలో ఎద్దువాగుపై ఉన్న గోనెల చప్టా

రాజుపాలెం: ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎద్దువాగుపై బ్రిడ్జి నిర్మాణం మాత్రం జరగలేదు. చిన్నపాటి వర్షం వచ్చినా పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అనేక సార్లు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. మండలంలోని గణపవరం–బలిజేపల్లి మధ్యలో ఎద్దువాగు ప్రవహిస్తుంది. ఈ వాగుపై బ్రిడ్జి నిర్మించండి మహాప్రభో.. అని గత 40 ఏళ్ల నుంచి ప్రజలు డిమాండ్ చేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు.

రాకపోకలు బంద్

వర్షాలు వస్తే పూర్తిగా రాకపోకలు బంద్ అవుతాయి. ఈ రహదారి గుండా సత్తెనపల్లి నుంచి రెడ్డిగూడెం, గణపవరం–బలిజేపల్లి ద్వారా నకరికల్లుకు నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. గణపవరం–బలిజేపల్లి మధ్యలో వాగు పదిహేను అడుగుల లోతులో ప్రవహిస్తుంది. గతంలో రాకపోకలకు ఇబ్బంది కలగడంతో గోనెలతో చప్టా ఏర్పాటు చేశారు. అయినా సరే వర్షాలు వస్తే చప్టాపై నుంచి 5 అడుగుల ఎత్తులో నీరు ప్రవహిస్తుంటుంది. ఈ విధంగా మూడు, నాలుగు రోజులు వాగు ప్రవహిస్తూ ఉంటుంది. దీని వలన బలిజేపల్లి, ఉప్పలపాడు, ఇనిమెట్ల, రామిరెడ్డిపేట, లక్ష్మీపురం, చల్లాపల్లి తండాల ప్రజలు మండలానికి రావాలంటే ఇబ్బందులు పడతారు. ఆ మూడు, నాలుగు రోజులు మండలంలో సత్సంబంధాలు తెగిపోతాయి. 2016లో భారీ వర్షాల కారణంగా ఎద్దువాగుపై నిర్మించిన చప్టా పూర్తిగా కొట్టుకుపోయింది. సమీప ప్రాంతాల్లోని వందల ఎకరాల్లో పంటలు నీట మునిగి పంట నష్టం కావడంతో రైతులు లబోదిబోమన్నారు. దాని స్థానంలో తాత్కాలికంగా గోనెలు ఏర్పాటు చేసి మట్టి రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి ప్రజలకు కష్టాలు ప్రారంభమయ్యాయి. మరలా 2024 ఆగస్టు నెలలో వర్షాలు పడడంతో చప్టాపై నుంచి నాలుగు అడుగుల మేర నీరు ప్రవహించింది. దీంతో పోలీసులు రాకపోకలు సాగకుండా నాలుగు రోజులు బందోబస్తు ఏర్పాటు చేశారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.



2024 ఆగస్టులో చప్టాపై నుంచి ప్రవహిస్తున్న వాగు (ఫైల్)

ప్రజల కష్టాలు తీర్చాలి



ఎన్నో ఏళ్ల నుంచి వాగుపై బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూనే ఉన్నాం. ప్రభుత్వం మారినప్పుడల్లా కచ్చితంగా బ్రిడ్జి కడతామని వాగ్దానం చేస్తారు. కానీ తరువాత పట్టించుకోరు. చిన్నపాటి వర్షం వచ్చినా రాకపోకలు బంద్ అవ్వడమే గాక పంటలు నీట మునుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బ్రిడ్జి నిర్మించి ప్రజల కష్టాలు తీర్చాలి.

– జొన్నలగడ్డ ప్రసాద్, మాజీ సర్పంచ్ , బలిజేపల్లి

రాకపోకలు నిలిచిపోతాయి



వర్షాలు వస్తే రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. మండలం నుంచి మూడు, నాలుగు రోజులు రాకపోకలు బంద్ అవుతాయి. గతంలో ధైర్యం చేసి వాగు దాటే ప్రయత్నంలో మనుషులు, ఎద్దులు, గేదెలు కొట్టుకుపోయాయి. ఏళ్లు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణం జరగడం లేదు. ప్రజా ప్రతినిధులు స్పందించి బ్రిడ్జి ఏర్పాటు చేయాలి.

– రామావతు తులసీనాయక్, మాజీ సర్పంచ్, ఉప్పలపాడు

క్లుప్తంగా

స్థానిక సంస్థల బలోపేతానికి సహకరించండి



అమరావతి: పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్ రంగసామిని ఆయన అధికారిక కార్యాలయంలో అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మంగళవారం కలిసి పుదుచ్చేరి రాష్ట్రంలో స్థానిక సంస్థల బలోపేతానికి మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలు బలోపేతం దిశగా అడుగులు పడుతున్న క్రమంలో మరింత ప్రోత్సాహాన్ని అందిస్తే త్వరితగతిన అభివృద్ధి చెందుతాయని సీఎం రంగసామి అభిప్రాయపడ్డారన్నారు. పుదుచ్చేరి రాష్ట్రంలో అఖిల భారత పంచాయతీ పరిషత్ సంస్థ ద్వారా స్థానిక సంస్థల బలోపేతానికి నిర్వహిస్తున్న కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి ఎన్ రంగసామి హామీ ఇచ్చారన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



రాజుపాలెం: ఈ నెల 27వ తేదీన కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావులు మంగళవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 159, 160 పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. అన్ని ఏర్పాట్లను సక్రమంగా చేయాలని అధికారులను ఆదేశించారు. వారి వెంట రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు, ఎస్‌ఐ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

నకరికల్లు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావులు మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద భద్రత, మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యాలు, ఓటర్ల క్యూలైనుకు సంబంధించిన ఏర్పాట్లపై ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి ఆటంకం లేకుండా పోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. వారి వెంట తహసీల్దార్ కె.పుల్లారావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీలో సోషల్ ఆడిట్

అచ్చంపేట: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్ కె.ఎస్.రాజు ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ బృందం మంగళవారం సోషల్ ఆడిట్ నిర్వహించారు. తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్, సీఐ వెంకటప్రసాద్‌లు పరిశీలించారు. విద్యార్థులకు అందచేస్తున్న మధ్యాహ్న భోజనం, డార్మిటరీలోని వసతులు, నీటి వసతి, మరుగుదొడ్లు, విద్యార్థులకు అందచేసే కాస్మోటిక్స్ వంటి సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందాల్సిన యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీ గురించి ఆరా తీశారు. విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సదుపాయాలు ఏర్పాటు చేస్తుందని, వాటిని విద్యార్థులకు సక్రమంగా అందేలా చూడాలని తహసీల్దారు కళాశాల స్పెషల్ అధికారి జ్యోత్స్నకు సూచించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం, అల్పాహారం అందించాలన్నారు. మార్చిలో జరిగే టెన్త్, ఇంటర్ విద్యార్థుల పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని, వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

జగన్నాథం మృతికి నివాళులు

సత్తెనపల్లి: పట్టణంలోని 21వ వార్డుకు చెందిన మల్లెం జగన్నాథం (80) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి జగన్నాథం భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, వల్లెం నరసింహారావు, కూకట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

14న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ముప్పాళ్ళ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 14వ తేదీన జరుగుతుందని ఎంపీడీవో పి.జె.విలియమ్స్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోని సర్వసభ్య సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సమావేశానికి గౌరవ సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఆయా శాఖల మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 3 పోలింగ్ బూత్‌లు

తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు శ్రీనివాసయాదవ్, సీఐ వెంకటప్రసాద్

అచ్చంపేట: ఈ నెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అచ్చంపేట మండలంలో మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు జి.శ్రీనివాసయాదవ్ తెలిపారు. మంగళవారం సీఐ వెంకటప్రసాద్‌తో కలసి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండలంలో మొత్తం 1,481 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇందుకు గాను స్థానిక జెడ్పీ హైస్కూలులో రెండు, తాడువాయి ఎంపీయూపీ స్కూలులో ఒకటి పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశామన్నారు. జెడ్పీహెచ్ స్కూలులోని 334 పోలింగ్ స్టేషన్‌లో 672 మంది, 335లో 667 మంది, తాడువాయిలోని 336 పోలింగ్ స్టేషన్‌లో 142 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. మార్చి 3న కౌంటింగ్ జరుగుతుందని చెప్పారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీఐ వెంకటప్రసాద్ తెలిపారు.

ప్రతి గ్రాడ్యుయేట్ ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి: ప్రతి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం సత్తెనపల్లి పట్టణ, సత్తెనపల్లి రూరల్ మండల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు విద్యావంతులు, మేధావులు ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, ఇచ్చిన ప్రతి ఒక్క హామీ రామన్న రోజుల్లో అమలు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమంలో పరిశీలకుడు వేములకొండ శ్రీనివాస్, నాయకులు మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, పూజల వెంకటకోటయ్య, కోమటినేని శ్రీనివాసరావు, ఆళ్ళ సాంబయ్య తదితరులు ఉన్నారు. ముందుగా నాయకులతో కలిసి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

కనుల పండువగా లక్ష్మీనర్సింహస్వామి గ్రామోత్సవం



నకరికల్లు: స్థానిక లక్ష్మీనర్సింహస్వామి గ్రామోత్సవ వేడుక మంగళవారం రాత్రి కనుల పండువగా సాగింది. పౌర్ణమిని పురస్కరించుకొని కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయం వద్ద ఉన్న ఆదిలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనర్సింహస్వామి వార్ల ఉత్సవర్లను కొండపైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వార్ల ఉత్సవ మూర్తులు కొలువుదీరగా భక్తులు ఊరేగింపుగా తరలివెళ్లారు. డప్పు వాయిద్యాల నడుమ స్వామి వారి కీర్తనలు ఆలపిస్తూ ఊరేగింపు సాగింది. కొండవద్దకు చేరుకొని అర్చకులు కొడవటికంటి మధుసూధనాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా స్వామి వారి ఏకాహం నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.

వేంకటేశ్వరస్వామి తిరునాళ్లను జయప్రదం చేయాలి

ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి

రాజుపాలెం: దేవరంపాడు కొండపై మత్స్య రూపంలో వెలసిన వేంకటేశ్వరస్వామి ఐదు శనివారాల తిరునాళ్లను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి జయప్రదం చేయాలని సత్తెనపల్లి ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దేవరంపాడు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో తిరునాళ్లను జయప్రదం చేసేందుకు దేవదాయ, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, విద్యుత్, ఆరోగ్య శాఖ, ఎస్ఎస్‌పీ, ఫారెస్టు, ఎక్సైజ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ మార్చి నెల 1వ తేదీ, 8, 15, 22, 29 తేదీలలో ఐదు శనివారాలు తిరునాళ్ల, ఉగాది పండుగ రోజున భక్తుల దర్శనానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. క్యూలైన్‌లో భక్తులకు అసౌకర్యం కలగకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలని, దేవదాయ శాఖ మంచినీళ్లు, మజ్జిగ అందించాలని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ తిరునాళ్లకు ముందురోజు అనంతరం శుభ్రతను చేపట్టాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ వారు మంచినీళ్లను అందించాలని ఆదేశించారు. ఆర్చి నుంచి లైట్లను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ వారిని ఆదేశించారు. ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖ అధికారులకు తెలిపారు. ఎలాంటి అసంఘిక కార్యకలాపాలు జరుగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖకు, దేవాలయ ప్రాంతంలో మద్యం అమ్మకుండా చూడాలని ఎక్సైజ్ అధికారులకు సూచించారు. అధికారులు సమన్వయంతో పని చేసి వేంకటేశ్వరస్వామి తిరునాళ్లను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, ఈవో గణపతి సురేష్, డిప్యూటీ తహసీల్దారు జానీ బాషా, ఎస్‌ఐ వేణుగోపాల్, ఫారెస్ట్ రేంజ్ అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణం



నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల గ్రామంలోని గోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మతల్లి అమ్మవారి కల్యాణ వేడుక మంగళవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారి కల్యాణ వేడుక పురస్కరించుకొని ఆలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. అర్చకులు చట్టు పూర్ణయ్య, చట్టు శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. అమ్మవారిని, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవారి కల్యాణం కమనీయంగా జరిపించారు. పలు గ్రామాల నుంచి కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వేడుకల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఘంటసాలకు ఘన నివాళి



పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో ఘంటసాల విగ్రహం వద్ద ఘంటసాల వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలో రాఘ సుధ కళా పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఘంటసాల చిత్ర పరిశ్రమకు అందించిన సేవలను పలువురు కొనియాడారు. పాండు రంగ శ్రీను, ముప్పాళ్ల సాంబశివరావు, గుడివాడ కుటుంబరావు, కొత్త రాధ, ఆత్మకూరి నరసింహామూర్తి పాల్గొన్నారు.

డబ్బులు ఇప్పించాలంటూ మిర్చి రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధిత మిర్చి రైతులు

కొరిటిపాడు(గుంటూరు): మిర్చి అమ్మకం డబ్బులు ఇప్పించాలంటూ పల్నాడు జిల్లా, అచ్చంపేట మండలం గ్రంధసిరి గ్రామానికి చెందిన బాధిత మిర్చి రైతులు మంగళవారం మిర్చి యార్డు ఆవరణలోని పరిపాలన కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా బాధిత మిర్చి రైతులు మాట్లాడుతూ గత ఏడాది మిర్చి సీజన్‌లో విజయ భాస్కర్ ట్రేడర్స్ మిర్చి కమీషన్ షాపు నిర్వాహకులు గోపు శ్రీనివాసరెడ్డి, సగిలి కిషోర్‌రెడ్డిలకు రూ.50 లక్షల విలువైన మిర్చి బస్తాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఐదుగురుకి ఒక్కొక్కరికి రూ.10 లక్షలు చొప్పున మొత్తం రూ.50 లక్షలు ఇవ్వాలన్నారు. ఏడాది పాటు అదిగో ఇస్తాం.. ఇదిగో ఇస్తాం అంటూ.. కాలం వెళ్లబుచ్చుకుంటూ వచ్చారన్నారు. ఇప్పటికే గుంటూరు లాలాపేట, సత్తెనపల్లి పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టడం జరిగిందని వివరించారు. సంవత్సర కాలంగా డబ్బుల కోసం తిరుగుతున్నా తప్పించుకుని తిరుగుతున్నారని మండిపడ్డారు. తమకు రావాల్సిన డబ్బులు తమకు ఇవ్వాలని, డబ్బులు ఇవ్వకపోతే ఆత్మహత్యలు చేసుకోవడమే శరణ్యమని హెచ్చరించారు. అనంతరం మిర్చి ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రికకు రైతులు కోటేశ్వరరావు, కోటపాటి నరసింహారావు, కోటపాటి నాగేశ్వరరావు, పరుచూరి ప్రతాప్, కిలారి నాగేశ్వరరావు వినతిపత్రం అందజేశారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కసరత్తు

- టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- బృందాలతో పాఠశాలల్లో తనిఖీలు
- నియోజకవర్గంలో 2,651 మంది విద్యార్థులు



సుగాలికాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

సత్తెనపల్లి: పదవ తరగతి విద్యార్థి భవిష్యత్తులో కీలక ఘట్టం. ఈ పరీక్షల్లో ప్రతిభే భవితకు గీటురాయి. అందుకే దీన్ని సమరంగా భావిస్తారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. ఇప్పటివరకు పడిన కష్టం ఒక ఎత్తయితే ఇక ముందు చేసే కసరత్తు మరో ఎత్తు. విద్యా శాఖ పదవ తరగతి పరీక్షలు షెడ్యూల్‌ను విడుదల చేసింది. మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయి. ఇప్పటి నుంచి విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదవాల్సి ఉంటుంది. పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతకు ప్రణాళికను విద్యా శాఖ ఖరారు చేసింది. దాన్ని పక్కాగా అమలు చేయడానికి విద్యా శాఖ అధికారులు అహర్నిశలు కృషి చేస్తున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ముమ్మరంగా కసరత్తు జరుగుతోంది.

2,651 మంది విద్యార్థులు

సత్తెనపల్లి నియోజకవర్గంలో 39 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 2,651 మంది పది పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలిచేందుకు విద్యార్థులు ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. అన్ని పాఠశాలల్లోనూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

కసరత్తు సాగుతోంది ఇలా...

- ఇప్పటికే అన్ని సబ్జెక్టుల్లోనూ సిలబస్ పూర్తి చేశారు.
- జిల్లా విద్యా శాఖ అందించిన మాదిరి ప్రశ్న పత్రాలపై అవగాహన కల్పిస్తున్నారు.
- ఆగస్టు నెల నుంచే ప్రతి పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణ.
- ప్రతి రోజు ఒక సబ్జెక్టులో స్లిప్ టెస్ట్ పెట్టి విద్యార్థుల లోపాలు తెలియ జేయడం.
- విద్యార్థులను బృందాలుగా విడదీసి వెనుకబడిన వారు మెరుగయ్యేలా ప్రత్యేక శిక్షణ.
- క్రమం తప్పకుండా విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు. నెలకోసారి తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రగతిని తెలియజేస్తున్నారు.
- విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా అకడమిక్ కౌన్సిలర్‌గా ఉపాధ్యాయులను నియమించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు
- పాఠశాలల్లో డిజిటల్ తరగతుల ఏర్పాటు. అధిక మార్కుల సాధనకు ఈ డిజిటల్ విధానం బాగా ఉపయోగపడుతుందని విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ప్రయాణాలు ఇప్పట్లో ఆగేవి కావు



మిర్చి కోతలు ఉన్నంత వరకు కూలీల డిమాండ్ ఉంటుంది. డిమాండ్ మేరకు కూలీలను తరలించటం జరుగుతుంది. మండలంలో మిర్చి కోతలకు ముమ్మరంగా కూలీలు వెళ్తున్నారు. టాటా ఏస్‌లు, ట్రాక్టర్లు, ఆటోల్లో కూలీలను తరలిస్తున్నారు. మితి మీరిన సామర్థ్యంతో కూలీలు వాహనాల్లో వెళ్తున్నారు. ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా, వెళ్లకూడదని తెలిసినా వెళ్తూనే ఉండటం పరిపాటిగా మారింది.

– క్రోసూరు





మహిళలు చట్టాల గురించి తెలుసుకోవాలి



మాట్లాడుతున్న డీబీఆర్సీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ హేమలత

సత్తెనపల్లి: మహిళలు గౌరవంగా బ్రతకాడానికి అనేక చట్టాలు ఉన్నాయని, ఆ చట్టాలను ప్రతి మహిళ తెలుసుకోవాలని సచివాలయ మహిళా పోలీస్ నందిని అన్నారు. పట్టణంలోని 16వ వార్డు చెంచు కాలనీలో మహిళలకు మహిళా హక్కుల సంక్షేమం, అభివృద్ధిపై మంగళవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కో ఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలకు రక్షణ చట్టాలు అనేకం ఉన్నాయని, వాటిని వినియోగించుకొని ధైర్యంగా సమాజంలో గౌరవంగా బ్రతికే అవకాశాన్ని తెలుసుకోవాలన్నారు. అన్ని రంగాల్లో మహిళలు ముందుంటున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు డ్వాక్రా గ్రూపులో చేరాలని, కుటుంబానికి మహిళలే ఆధారమన్నారు. డీబీఆర్సీ ప్రోగ్రాం కోర్డినేటర్ హేమలత మాట్లాడుతూ స్త్రీకి ముఖ్యంగా చదువు ఉండాలని, మీరు చదువుకోలేక పోయినా మీ ఆడపిల్లలను చదివించాలన్నారు. సమాజంలో ధైర్యంగా ఉండేటట్లు వారిని ప్రోత్సహించాలని, చట్టాల గురించి వారికి తెలిసే విధంగా చేయాలన్నారు. డీబీఆర్సీ రీజనల్ కో ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ మొదటి నుంచి వారికి విద్యాబుద్ధులు నేర్పించే విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సదస్సుకు 3 ఏరియాల నుంచి చెంచు, బుడగ జంగాల కాలనీ, యానాది కాలనీ మహిళలు హాజరయ్యారు. కార్యక్రమంలో మహిళా సంఘ బాధ్యులు పినపాటి ఈశ్వరి, తిరుపతి, క్రిస్టియన్నమ్మ, పచ్చిగుర్ల బేబీ, మహిళలు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక

పిడుగురాళ్ల: మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక గురువారం నిర్వహించడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలు అందాయన్నారు. దానికనుగుణంగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్డీఓ మురళీకృష్ణ

పిడుగురాళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్‌గా గురజాల ఆర్డీఓ మురళీ కృష్ణను ఎన్నికల కమిషన్ నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికలకు సహకరించాలని ఆయన సూచించారు.